క్లుప్తంగా

భారీ వర్షం



మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

సీతానగరం: మండలంలో పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుండి 12.30 వరకూ ఏకధాటిగా వర్షం కురవడంతో పొలాల్లో ఒక్కసారిగా నీరు చేరింది. ఇంతవరకూ వర్షాలు లేక ఖరీఫ్ సీజనుకు సంబంధించి పొలాల్లో వేసిన వరి వెద మొక్కలు ఎండిపోవడం, ఏపుగా పెరిగిన వరినారు ఆరిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ సమయంలో భారీగా వర్షం కురవడంతో కొంత ఉపశమనం కలిగింది.

రంగంపేటలో వైద్య శిబిరం



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: మండలంలోని రంగంపేట గ్రామంలో ఎంపీహెచ్ఈఓ జి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో డాక్టర్ రాధాకాంత్ నేతృత్వంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 80 మందికి రక్త నమూనాలు సేకరించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలం కావడంతో ప్రజలంతా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు రాధాకాంత్ సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాల్లో జగన్నాథస్వామి



పూజలు అందుకుంటున్న స్వామివారు

బలిజిపేట: జగన్నాథస్వామి ఉత్సవాలలో భాగంగా ఏడవ రోజు శనివారం స్వామివారిని శ్రీ రామ, శ్రీకృష్ణ అవతారాలలో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకుడు హరి ఆధ్వర్యంలో అర్చకులు ఆర్.పార్థసారథి ఆచార్యులు, పి.రవికుమార్, సురేష్‌లు గుండిఛా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పుచేసి పూజా కార్యక్రమాలు జరిపారు. దూపదీప నైవేద్యాలతో స్వామివారికి పూజలు జరిపిన అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

మితిమీరిన వేగం తగదు

• ఎస్సై నరసింహమూర్తి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మక్కువ: వాహనచోదకులు మితిమీరిన వేగంతో ప్రయాణించరాదని ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. శనివారం స్థానిక ప్రధాన రహదారి కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వారికి అపరాధరుసుం విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనచోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. సారా తరలిస్తూ వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రచారం




ఆధ్యాత్మిక ప్రచారం చేస్తున్న ఇందూ జ్ఞానవేదిక సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం గ్రామంలో త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ సభ్యులు శనివా రం ఆధ్యాత్మిక ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు రామినాయుడు త్రైతసిద్ధాంత భగవద్గీతలోని అంశాలను భక్తులకు వివరించారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మ గురించి తెలుసుకోవడం ద్వారా జ్ఞానాన్ని పొంది ఆధ్యాత్మికత వైపు అడుగు లు వేయడమే త్రైతసిద్ధాంత భగవద్గీత ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, మద్దిరాజు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’ కాదు పంగనామం

• మహిళలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం
• మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



చంద్రబాబు మేనిఫెస్టో సూపర్ సిక్స్

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం పేరిట తల్లికి పంగనామాలు పెట్టేందుకు నిర్ణయించిందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా.. ప్రతి ఒక్కరికీ రూ.15వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ఆర్భాటంగా, అట్టహాసంగా ప్రచారం చేసిన టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక పథకం అమల్లో దగా చేస్తోందన్నారు. పిల్లలు, తల్లులను పచ్చిగా మోసం చేస్తోందన్నారు. టీడీపీ గొప్పగా చెప్పుకున్న సూపర్ సిక్స్‌లో కూడా పథకాన్ని చూపారన్నారు. ఇప్పుడు ఆ సూపర్ సిక్స్‌నే ప్రస్తావించడం లేదన్నారు. తల్లికి వందనం అమలుపై ఇటీవల జీఓ 29 జారీ చేసిన ప్రభుత్వం, అందులో ప్రతి పిల్లాడికి అని కాకుండా.. ప్రతి తల్లికి రూ.15వేలు ఇస్తామంటూ ప్రకటించిందన్నారు. అసలు ఈ పథకాన్ని ఎలా అమలు చేయాలనుకుంటున్నారో కూటమి నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నోరు మెదపడం లేదని అన్నారు. ప్రతి పథకాన్ని ఆధార్‌తో అనుసంధానం చేస్తూ పార్టీలకతీతంగా, పూర్తి పారదర్శకంగా అన్ని పథకాలను లబ్ధిదారులకు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. దీన్ని గడిచిన ఐదేళ్లలో అందరూ చూశారన్నారు. మేనిఫెస్టోకు కట్టుబడి ఉండకపోవడం, ఇచ్చిన మాట తప్పడం, పథకాలు అమలు చేయకపోవడం, ప్రశ్నిస్తే దబాయించడం, ఎదురు దాడి చేయడం తెలుగుదేశం ఆనవాయితీ అని ఎద్దేవా చేశారు. తల్లికి వందనం పథకం అమలు విషయంలో కూడా కూటమి ప్రభుత్వం అదే ధోరణి చూపుతోందన్నారు. జగన్ ప్రభుత్వమే వచ్చి ఉంటే ఈ సమయానికే అమ్మ ఒడి పేరిట తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసి ఉండేదన్నారు.

జగన్‌పై అక్రమ కేసు

సాక్షాత్తూ సుప్రీంకోర్టు తప్పు పట్టినా, అప్పటి ఎంపీ రఘురామ ఫిర్యాదులో వాస్తవం లేదని తేల్చి చెప్పినా.. ఆ కేసు అప్పుడే కొట్టివేసినా.. మళ్లీ ఈ ప్రభుత్వం నిస్సిగ్గుగా జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమంగా కేసు పెట్టిందన్నారు. ఎవరి సంతోషం కోసమో.. ఎవరిని ఇబ్బంది ఇబ్బంది పెట్టడం కోసమో అన్నట్టు మూడేళ్ల తరువాత కేసు నమోదు చేశారన్నారు. రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేశారన్నారు. రాష్ట్రంలో పోలీసులు కొత్త సంప్రదాయానికి తెరతీశారన్నారు.

బిల్లబంద ఎక్కడ!



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గ్రేడ్ వన్ మున్సిపాలిటీలో సౌందర్య నారాయణమూర్తి నగర్‌కు పరమేశ్వరి లే అవుట్‌కు మధ్యన వెలసిన లే అవుట్‌ను పట్టణ సీపీఎం కార్యదర్శి గొర్లి వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్‌కు మున్సిపాలిటీ వారి అనుమతులు లేవని, బిల్లబందను కప్పేసి లే అవుట్ వేసారని కొన్ని పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు లక్షలాది రూపాయలు అందాయని, అందుకే మున్సిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు చర్యలు చేపట్టడం లేదని ప్రజల్లో చర్చ జరుగుతుందన్నారు. బిల్లబంద సర్వే నెంబరు 119/12లో 38 సెంట్లు, 120/2 లో 50 సెంట్లు వెరసి 88 సెంట్లు గోపసాగరం చెరువు నుండి, బిల్లబంద గోర్జ సర్వే నెంబరు 123లో 32 సెంట్లు, 124లో 54 సెంట్లు, బిల్లబంద, గోర్జ కలిపి 1.74 సెంట్లు ప్రభుత్వానిది చూపించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. త్వరలో దీనిపై కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమ, చొక్కాపు వెంకటరమణ పాల్గొన్నారు.

చెరకు రైతులకు అవగాహన సదస్సు



సదస్సులో ఈఐడీ ప్యారీ(ఐ)లిమిటెడ్ ఉపాధ్యక్షులు పట్టాభిరామిరెడ్డి

సీతానగరం: ఈఐడీ ప్యారీ(ఇండియా)లిమిటెడ్ చక్కెర కర్మాగార యాజమాన్యం బొబ్బిలి జోన్ పరిధిలో సీతానగరం మండలం కామందొరవలసలో రైతులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ ఏవీ పి.పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో చెరకు సాగులో అధిక దిగుబడి వస్తున్నందున రైతులు చెరకు సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. ,చెరకు సాగు విస్తీర్ణం పెంచే రైతులకు యాజమాన్య ప్రోత్సాహకాలు ఇస్తుందన్నారు. ఆర్‌అండ్‌డీ హెడ్ షణ్ముఖ సుందరం, కేన్ హెడ్ జె.రాజేంద్ర మాట్లాడుతూ చెరకు సాగులో మెలకువలు, అధిక దిగుబడులు వచ్చే కొత్త రకాల చెరకు పంటను ఎంపిక చేసుకునేందుకు రైతులు అవగాహన కల్పించు కోవాలన్నారు. రైతులకు ఫ్యాక్టరీ నుండి వచ్చే రాయితీలు, ఎరువులు, కలుపు మందుల వినియోగం, చెరకు దిగుబడిపై రైతులు యాజమాన్యం ఇచ్చే సూచనలు పాటించాలన్నారు. సుమారు ఎకరా విస్తీర్ణంలో 60 టన్నులు వరకూ ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. రైతులు సమస్యలు పరిష్కరించడానికి యాజమాన్యం చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం రైతులకు కొత్త వంగడాలపై అవగాహన కల్పించుకునేందుకు, యాంత్రీకరణ పరికరాలు వినియోగం, చెరకు విత్తే విధానంపై ప్రదర్శనలు ఇచ్చారు. సదస్సులో డీజీఎం రమేష్, మురళి, పలు గ్రామాల చెరకు ఉత్పత్తిదార్లు, స్థానిక ఈఐడీ ప్యారీ ఇండియా లిమిటెడ్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న చెరకు రైతులు

షాపుల వేలం ఖరారు



వేలంపాటలో పాల్గొన్న స్థానిక వ్యాపారులు

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీకి చెందిన షాపులను అద్దెకు ఇచ్చేందుకు శనివారం బహిరంగ వేలం నిర్వహించారు. పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తుల సమక్షంలో వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా పంచాయతీకి రూ.6.63 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ రాము తెలిపారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న మూడు షాపులను వేలంలో పాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ షాపులకు త్వరలోనే మరోసారి వేలం నిర్వహిస్తామన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దబ్బలగూడ నుంచి ఇజ్జకాయి గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఇజ్జకాయి గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని గుమ్మలక్ష్మీపురంలోని ఆమె నివాసంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామానికి రోడ్డు నిర్మిస్తామని వారికి హామీ ఇచ్చారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి దర్శనానికి శనివారం భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ, మంగళాశాసనం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పుట్టుదేవుని వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ సంస్థలు ఆస్తి పన్ను చెల్లించాలి



మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలో ఆస్తి పన్ను బకాయి ఉన్న ప్రభుత్వ సంస్థలు సత్వరమే ఆ బకాయిలను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే పన్ను బకాయిదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. స్థానిక గృహ యజమానులతో పాటు కొన్ని ప్రభుత్వ సంస్థలు కూడా ఆస్తి పన్ను బకాయిలను చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా స్థానిక జిల్లా ఆస్పత్రికి సంబంధించిన ఆస్తిపన్ను బకాయి పేరుకుపోయిందని ఈ నెల 31వ తేదీ వరకు జిల్లా ఆస్పత్రికి సంబంధించి ఆస్తి పన్ను రూ.2,10,10,129లుగా ఉందని వడ్డీతో కలిపి మొత్తం నాలుగు కోట్ల 36 లక్షల 85 వేల ఎనిమిది వందల తొమ్మిది రూపాయలుగా బకాయి ఉందన్నారు. అలాగే లేడీ డాక్టర్ క్వార్టర్స్‌కు సంబంధించి 25 లక్షల తొంభై ఒక వేయి ఐదు వందల ఏభై నాలుగు రూపాయలు, కుళాయి పన్నుకు సంబంధించి 16 వేల రూపాయలు ఉందన్నారు. ఈ పన్ను బకాయిలకు సంబంధించి ఇప్పటికే పలు సార్లు ఆస్పత్రికి నోటీసులు అందజేసిన కనీస స్పందన లేదన్నారు.

ఆస్తి పన్ను బకాయి వాస్తవమే..

జిల్లా ఆస్పత్రికి సంబంధించి మున్సిపాలిటీకి ఆస్తి పన్ను బకాయి చెల్లించాల్సిన విషయం వాస్తవమేనని డీసీహెచ్ఎస్ వాగ్దేవి అన్నారు. ఈ పన్ను చెల్లింపు విషయమై ప్రతి నెల జీతాలతో పాటు ఆస్తి పన్నుకు సంబంధించిన బిల్లులు పెట్టి ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టడం జరుగుతుందన్నారు. వారు నిధులు విడుదల చేయగానే ఆస్తి పన్ను చెల్లిస్తామని తెలిపారు.

వైద్యాధికారికి సిబ్బంది సంఘీభావం



నల్లబ్యాడ్జీలతో వైద్య సిబ్బంది

పార్వతీపురం టౌన్: దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్‌పై కొందరు సిబ్బంది అసత్య ఆరోపణలు చేస్తూ అప్రతిష్టపాలు చేయడాన్ని వైద్య సిబ్బంది ఖండించారు. డాక్టర్‌కు మద్దతుగా నిలవాలని శనివారం నిర్ణయించి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పీహెచ్‌సీలోని కొందరు సిబ్బంది శరత్ అనే వ్యక్తితో కలిసి తప్పుడు ఆరోపణలకు దిగుతున్నారని సిబ్బంది ఆరోపించారు. శరత్ జిల్లా రిపోర్టర్ అని చెప్పుకుంటూ వైద్యాధికారిపై బ్లాక్‌మెయిల్ చర్యలకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. శరత్‌పై చర్యలు తీసుకునే వరకు డాక్టర్ భానుప్రతాప్‌కు అండగా ఉంటామని వైద్య సంఘం తేల్చి చెప్పింది. వైద్యాధికారులపై తప్పుడు ఆరోపణలకు వ్యతిరేకంగా ఐక్యంగా కలసి ఎదుర్కొంటామని తెలిపారు. డాక్టర్ భానుప్రతాప్‌కు న్యాయం చేయాలని వారు కోరారు. ఆయనకు న్యాయం జరిగే వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతామని తెలిపారు.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నేత్ర శస్త్రచికిత్సలు



శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారితో వైద్యులు

పార్వతీపురం టౌన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నేత్ర శస్త్ర చికిత్సలను జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఆరోగ్య సురక్ష, కంటి వెలుగు కార్య క్రమంలో భాగంగా జిల్లాలో వున్న సచివాలయాల పరిధిలో వున్న గ్రామాలలో గతంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేసి కేటరాక్ట్(అంతర కుసుమం) టేరిజియం(కొయ్యకండ) గుర్తించిన వారి చికిత్స నిర్వహించామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నేత్ర వైద్య నిపుణులు డా.వెంకటేష్ వీటిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరందరికీ ఉచిత వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శస్త్ర చికిత్సలు పూర్తయి ఇంటికి వెళ్లిన రోగులకు ఆస్పత్రి నేత్ర వైద్య అధికారి శ్రీనివాసరావు పలు సూచనలు, జాగ్రతలు వివరించారు. కార్యక్రమంలో సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట: గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని శనివారం ఆయన సందర్శించారు. వార్డులను పరిశీలించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో వసతులు, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆస్పత్రిలో సరైన వైద్యం అందడం లేదని, వైద్యులు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదు చేశారు. టైఫాయిడ్, మలేరియా పాజిటివ్ కేసులు ఎక్కువగా ఉన్నందున గిరిజన గ్రామాల్లో మెడికల్ క్యాంపులు పెట్టాలని, పారిశుధ్య కార్యక్రమాలు విస్తతంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

తోటపల్లి నీరు విడుదల

• శివారు భూములకు సాగునీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే జగదీశ్వరి
• కాలువల దుస్థితిపై డీఈఈని ప్రశ్నించిన రైతులు



తోటపల్లి ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి: ఈఏడాది ఖరీఫ్‌కు తోటపల్లి ప్రాజెక్టు పాత ఆయకట్టుకు సంబంధించి శివారు భూములకు నిరాటంకంగా సాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసకుంటామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం ఉదయం తోటపల్లి ప్రాజెక్టు ఎడమ, కుడికాలువ గేట్లను పైకెత్తి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలువల ద్వారా సరఫరా అయ్యే నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని రైతులను కోరారు. కాలువలు బలహీనంగా ఉన్నచోట తక్షణం మరమ్మత్తులు చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. కాలువ పరిధిలో సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రాజెక్టు ఎడమకాలువ పరిధిలో 30,602 ఎకరాలకు, కుడికాలువ ద్వారా 7,942 ఎకరాలకు సాగునీరు సరఫరా చేస్తున్నట్లు ప్రాజెక్టు డీఈఈ డి.రవికుమార్ తెలిపారు. కాలువ పరిధిలోని 8 బ్రాంచీలకు సాగునీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నదిలోకి 1800 క్యూసెక్కుల నీరు రాగా, ఎడమ కాలువ ద్వారా 150 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కాలువల ఆధునీకరణకు రూ.193 కోట్లు మంజూరయ్యిందని, ఇంతరకు 22 శాతం పనులు పూర్తయినట్లు చెప్పారు. కాలువల నిర్వహణను పరిశీలించేందుకు 30 మంది లస్కర్లు పనిచేయాల్సి ఉండగా కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారని ఎమ్మెల్యే జగదీశ్వరికి వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎ.మధుసూదనరావు, డి.వెంకటనాయుడు, డి.సత్యనారాయణ, కె.సుమన్, ఎ.తవిటినాయుడు, ఎం.సింహాచలంనాయుడు, విజయాంకుశం, ఏఈలు కె.రాజేష్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



డీఈఈ రవికుమార్‌ను ప్రశ్నిస్తున్న రైతులు

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

కాలువల ఆధునీకరణ పనులు చేస్తున్నామంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్ప పనులు చేయకపోవడంతో సాగునీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వంగర మండలానికి చెందిన రైతులు డీఈఈ రవికుమార్‌ను ప్రశ్నించారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత ఆరు సంవత్సరాలుగా సాగునీరు అందడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువలలో పూడికలు, పిచ్చిమొక్కలు ఉంటే సాగునీరు ఎలా సరఫరా అవుతుందని ప్రశ్నించారు. పేరుకే కాలువలు, సాగునీరు వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. సాగునీటిపై ప్రశ్నిద్దామన్నా అధికారులు ఫోన్‌కు కూడా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు సరఫరా చేస్తామని డీఈఈ రైతులకు భరోసానిచ్చారు.

కషాయాలతో చీడపీడల నివారణ



కషాయాల తయారీపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

సీతంపేట: వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంపలగూడ గ్రామంలో రైతులకు శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. బీజామృతం, ద్రవజీవామృతం, ఘనజీవామృతం తయారీ విధానం, వినియోగం, ఉపయోగాలను రిసోర్స్ పర్సన్లు పాలక నాగేశ్వరరావు, చిరంజీవులు వివరించారు. సీమాస్త్రం, పంచపత్ర కషాయం పిచికారీతో తెగుళ్లను సమర్థంతంగా నిర్మూలించవచ్చన్నారు. శ్రీవరి, వరి లైన్‌షోయింగ్, వరి జమున మోడల్ తయారీతో మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ వసంత, సీడీఎస్ లావణ్య, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

భామిని: స్థానిక ఏపీ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్‌లో 6,7,8వ తరగతులతో పాటు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం హెచ్ఈపీ గ్రూపులో మిగులు సీట్లలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఒ.గంగాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 10 సీట్లు, 7వ తరగతిలో 3 సీట్లు, 8వ తరగతిలో 1 సీటు, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ హెచ్ఈపీ గ్రూపులో 14 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 18న ఉదయం 10 గంటలకు రెండో విడత కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. 6,7,8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు కొత్తూరులోని ఏకలవ్య పాఠశాలలో నిర్వహించే కన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. ఈఎంఆర్ఎస్‌లో ప్రవేశాల కోసం గతంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని, సీట్లు రాని అభ్యర్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.